

అడుగు దూరంలో నీటి విడుదల

కృష్ణా జలాలు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ గేట్లను తాకాయి. నీటిమట్టం 851.90 అడుగులకు చేరగా.. 854 అడుగులకు చేరగానే నీరు విడుదల చేయవచ్చు. 8లో▸



వసతి మూత'బడి'

ప్రభుత్వ పాఠశాలలు ఈ నెల 12న పునఃప్రారంభమైనా ఆలూరులోని బీసీ బాలుర వసతి గృహం ఇప్పటి వరకు తెరుచుకోలేదు. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,613.14
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 44.198
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 38,007
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 193

న్యూస్‌రీల్

ప్రత్యేక వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

నంద్యాల(న్యూటౌన్): దివ్యాంగుల ఉపకరణాల పంపిణీ కోసం ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు రవికృష్ణ, అధ్యక్షుడు రమణయ్య, కార్యదర్శి రామలింగం సూచించారు. శనివారం వారు మాట్లాడుతూ ఈనెల 26వ తేదీన నంద్యాల పురపాలక టౌన్‌హాల్‌లో, జూన్ 28న నందికొట్కూరు, జూలై 1న ఆళ్లగడ్డ, 4న ఆత్మకూరు, 8న బనగానపల్లె, 11న డోన్, 15న పాణ్యంలో ఈ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగుల సహాయ పరికరాల ఉచిత పథకం, భారత కృత్రిమ అవయవాల తయారీ సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులు, వృద్ధులను పరీక్షించి బ్యాటరీతో నడిచే మూడు చక్రాల సైకిళ్లు, చంక కర్రలు, వినికిడి యంత్రాలు, అంధుల చేతి కర్రలు ఉచితంగా అందించడానికి ఎంపిక చేస్తారన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం



పెసరవాయిలో అతిసార నివారణ పోస్టరును విడుదల చేస్తున్న దృశ్యం

గడివేముల: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన అవసరమని నంద్యాల జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సుదర్శన్‌బాబు అన్నారు. శనివారం స్థానిక పీహెచ్‌సీని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి డాక్టర్లు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్నది వర్షాకాలం కావున అతిసార కేసులు ప్రబలే అవకాశం ఉన్నందున అవసరమైన మందులను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రతి ఉద్యోగి సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం పెసరవాయిలో జరుగుతున్న ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని తనిఖీ చేసి పోస్టర్లను విడుదల చేశారు. ఆయన వెంట డాక్టర్ కిరణ్‌కుమార్, ఎంపీహెచ్‌ఈఓలు జగదీశ్వరప్ప, మహేశ్వర రెడ్డి, సూపర్‌వైజర్ మనోహర్, ఎంఎల్‌హెచ్‌పీ అలీబాషా, ఏఎన్‌ఎం దేవకుమారి, ఆశాలు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



ఎంఈఓ 2 సుభాషిణీ దేవికి వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

పాములపాడు: మూడేళ్ల పిల్లలను చేర్చుకుంటున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్స్ ఎంఈఓ 2 సుభాషిణీ దేవికి ఫిర్యాదు చేశారు. శనివారం స్థానిక ఎమ్మార్సీ భవనంలో అంగన్‌వాడీ టీచర్లు నాగమణి, నాగమ్మ, శివలక్ష్మి, చెన్నమ్మ, నాగమద్దమ్మలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడేళ్ల వయస్సు నిండని పిల్లలను నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ అంటూ చేర్చుకోవడం వల్ల తల్లిదండ్రులు పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్చుతున్నారనానరు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతోందని, ఈ మేరకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఫీజుల మోత

- ప్రైవేట్ విద్యా సంస్థల్లో భారీగా ఫీజులు
- సీబీఎస్‌ఈ సిలబస్ పేరుతో మరింత దోపిడీ
- పబ్లిక్, ఇంటర్నేషనల్, వరల్డ్ స్కూల్స్ పేరుతో భారీగా వసూళ్లు
- పుస్తకాల నుంచి సాక్స్ దాకా పాఠశాలల్లోనే విక్రయాలు
- కార్పొరేట్ దోపిడీపై నోరెత్తని ప్రభుత్వం
- ఫీజులు కట్టలేక పేద, మధ్య తరగతి కుటుంబాలు అప్పుల పాలు



ఓ ప్రైవేట్ పాఠశాలలో విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన పుస్తకాలు(ఫైల్)

సాక్షి, నంద్యాల: ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల మోత మోగుతోంది. ప్రైవేటు విద్యాసంస్థలపై ప్రభుత్వానికి నియంత్రణ లేకపోవడంతో ఇష్టారీతిన డబ్బులు వసూలు చేస్తున్నారు. ఒకటో తరగతిలోనే ఫీజుల షాక్ తగులుతోంది. తాము చదువుకోలేకపోయినా తమ పిల్లలను ఉన్నత స్థాయిలో చూడాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందనే అపనమ్మకంతో వేలకు వేలు అప్పు చేసి మరీ చేర్పిస్తున్నారు. పేరెంట్స్ బలహీనతే విద్యాసంస్థలకు వరంగా మారింది. పాఠశాలల పేర్లు కూడా వింతవింతగా పెడుతున్నారు. తమది పబ్లిక్ స్కూల్ కాబట్టి ఫీజులు ఇలానే ఉంటాయని చెబుతున్నారు. తమవి ఇంటర్నేషనల్, వరల్డ్ స్కూల్ అంటూ చెబుతూ ప్రచారం చేసుకుంటూ ఉండడం గమనార్హం.

వసతుల పేరుతో వసూళ్లు

ప్రైవేటు విద్యా సంస్థలు విద్యార్థుల ప్రవేశాల కోసం అనేక రకాల వసతులు కల్పిస్తున్నామని చెబుతూ భారీగా ఫీజులు దండుకుంటున్నారు. టెక్నో, ఐఐటీ, నీట్ ఫౌండేషన్, ఏసీ క్యాంపస్, ఒలింపియాడ్ అంటూ ఫీజులు గుంజుతున్నారు. అయితే జిల్లాలోని 90 శాతం పాఠశాలలకు మైదానాలు లేవు. ఇరుకిరుకు గదుల్లోనే బోధన చేస్తున్నారు. బోధించే వారిలో కనీసం బీఈడీ చేసిన వారు కూడా ఉండడం లేదు. ప్రైవేటు పాఠశాలలపై విద్యాశాఖాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో విద్యావ్యవస్థ గాడితప్పుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

➤ బండి ఆత్మకూరు మండలానికి చెందిన వెంకటేశ్వరరావుకు ఇద్దరు పిల్లలు. పెద్ద కుమారుడు తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. నంద్యాల శివారులోని ఒక పబ్లిక్ పాఠశాలకు వెళ్లి . తొమ్మిదో తరగతికి ఫీజు వివరాలు ఆరా తీశారు. పాఠశాల ఫీజు రూ.50 వేలు, 3 జతల యూనిఫాం రూ. 5 వేలు, పుస్తకాలు రూ.9వేలు, 3 జతల షూస్ రూ.3వేలు, హాస్టల్‌లో ఉంటే టెలిఫోన్ బిల్ ఏడాదికి రూ.1,500, ధోబీకి రూ.2 వేలు, స్పోకెన్ ఇంగ్లిష్‌కు నెలకు రూ.500, అడ్మిషన్ ఫీజు రూ.5 వేలు, ఐఐటీ మెటీరియల్ రూ. 2 వేలు వీటితో ఎన్‌సీసీ ఫీజు, స్టేషనరీ, మెడికల్ బిల్స్, స్పోర్ట్స్ డ్రెస్ అదనం అని చెప్పడంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాడు.




➤ చాబోలు గ్రామానికి చెందిన నారాయణరెడ్డి అనే రైతుకు ఇద్దరు కుమార్తెలు. ఒకరు నాలుగు, మరొకరు ఆరో తరగతి చదువుతున్నారు. ఇద్దరిని మంచిగా చదివించాలనుకుని నంద్యాలకు దగ్గరలో ఉన్న ఒక ఇంటర్నేషనల్ స్కూల్‌కు వెళ్లాడు. అక్కడ ఆరో తరగతికి రెసిడెన్షియల్ ఫీజు అక్షరాలా లక్ష రూపాయలు అని చెప్పారు. దీనికి అడ్మిషన్ ఫీజు, యూనిఫాం, పుస్తకాలు, షూస్ ఇలా అన్ని కలిపితే మరో రూ.30 వేలు అవుతుందని చెప్పారు. నాలుగో తరగతికి అన్ని ఫీజులు కలిపి రూ. లక్ష అని చెప్పారు. ఇద్దరిని చేర్పిస్తే రూ.20 వేలు డిస్కౌంట్ ఇస్తామని చెప్పారు. పిల్లల చదువులే ముఖ్యమనుకున్న నారాయణరెడ్డి తెలిసిన వారి వద్ద అప్పుచేసి ఇద్దరిని అదే పాఠశాలలో చేర్పించాడు.

నియోజకవర్గం	పాఠశాలల సంఖ్య	చదువుతున్న విద్యార్థులు
ఆళ్లగడ్డ	69	16,512
బనగానపల్లె	85	20,836
డోన్	84	23,400
నందికొట్కూర్	45	16,126
నంద్యాల	154	48,827
(పాణ్యం, గడివేముల)	21	9,035
శ్రీశైలం	83	20,427
మొత్తం	541	1,55,163

నంద్యాలలో 154 పాఠశాలలు

జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కలిపి 541 ఉన్నాయి. వీటి పరిధిలో 1,55,163 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. అత్యధికంగా నంద్యాల జిల్లా కేంద్రంలో 154 పాఠశాలలున్నాయి. వీటిలో 48,827 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఒకటో తరగతికే రూ.20 వేలు చెబుతున్నారు. పాఠశాల ఫీజుకు అదనంగా అడ్మిషన్ ఫీజు, పుస్తకాలు, షూస్, యూనిఫాం ఫీజు అంటూ మరింత అదనంగా దోచేస్తున్నారు. చిన్న, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారు తమ పిల్లల్ని చదివించేందుకు అప్పులు చేయాల్సి వస్తోంది.



VI, VII & VIII CLASSES	
Admission Fee	Rs. 5,000.00
I Term Fee	Rs. 33,000.00
II Term Fee	Rs. 20,000.00
III Term Fee	Rs. 13,500.00
Total Annual Fee	Rs. 71,500.00

పాఠశాలలో 6, 7, 8వ తరగతులకు వసూలు చేసే ఫీజుల వివరాలు తెలిపే బ్రోచర్

జిల్లాలో 9 సీబీఎస్‌ఈ పాఠశాలలు

ఉద్యోగస్తులు స్టేట్ సిలబస్ కంటే సెంట్రల్ సిలబస్‌కు ప్రాముఖ్యతనిస్తున్నారు. దీంతో సీబీఎస్‌ఈ పాఠశాలల సంఖ్య కూడా పెరుగుతూ వస్తోంది. స్టేట్ సిలబస్ ఉన్న పాఠశాలల్లో వసూలు చేసే ఫీజు కంటే సీబీఎస్‌ఈ పాఠశాలల్లో రెండు రెట్లు అధికంగా వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా తొమ్మిది పాఠశాలలు మాత్రమే ఉండడంతో వీటికి డిమాండ్ బాగా పెరిగింది. తల్లిదండ్రుల ఆశలను పాఠశాలల యాజమాన్యాలు క్యాష్ చేసుకుంటూ భారీ లాభాలు ఆర్జిస్తున్నాయి. బనగానపల్లె, డోన్, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల, ప్యాపిలి, నందికొట్కూరులో ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. నంద్యాలలో మూడు పాఠశాలలు ఉన్నాయి. వీటి పరిధిలో 6,561 మంది విద్యార్థులు విద్యనభ్యశిస్తున్నారు.

ప్లే స్కూల్‌లో మరీ దారుణం

తల్లిదండ్రులు ఇద్దరు ఉద్యోగం చేస్తున్నవారు అధికంగా ఉంటున్నారు. దీంతో వారి పిల్లలను మూడేళ్లకే ప్లే స్కూల్‌లో వదులుతున్నారు. నంద్యాలలోని ఒక ప్లే స్కూల్‌లో నెలకు రూ.2 వేల చొప్పున వసూలు చేస్తున్నారు. జిల్లా, పట్టణ కేంద్రాల్లో ప్లే స్కూల్స్ పుట్టగొడుగుల్లా వెలుస్తున్నారు. ఇలా వెలుస్తున్న వాటిలో అధిక భాగం పాఠశాలలకు అనుమతులే ఉండడం లేదు. డబుల్ బెడ్ రూంలను అద్దెకు తీసుకుని అందులోనే ప్లే స్కూళ్లను నడిపిస్తున్నారు.

ఇద్దరు పిల్లలకు రూ.60 వేలు కడుతున్నా

నాకు ఇద్దరు పిల్లలు. ఒకరు ఐదు, అమ్మాయి సెకండ్ క్లాస్ చదువుతోంది. ఇద్దరికి కలిపి కేవలం ఫీజులే రూ.60 వేలు కడుతున్నా. అడ్మిషన్ సమయంలో ఫస్ట్ టర్మ్ ఫీజు కట్టాల్సిందేనని చెబుతున్నారు. పిల్లలకు యూనిఫాం, షూస్, సాక్స్, పుస్తకాలకు మరింత అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోంది. వ్యాన్ మాట్లాడుకుంటే నెలకు రూ.వెయ్యి అడుగుతున్నారు. పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాల పేరుతో మళ్లీ డబ్బులు అడుగుతున్నారు. సాధారణ మధ్య తరగతి కుటుంబాలు అప్పులు చేయాల్సి వస్తోంది.

– ఇంతియాజ్, నంద్యాల

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేటు పాఠశాలలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. తరగతుల వారీగా ఇంతే వసూలు చేయాలని ధర నిర్ణయించాలి. విద్యావ్యవస్థపై ప్రభుత్వం పట్టుకోల్పోయింది. కార్పొరేట్ల కంబంధహస్తాల్లోనే విద్యా వ్యవస్థ నడుస్తోంది. పాఠశాలలోనే అన్ని కొనాలని బలవంత పెట్టడం ఏంటి? చాలా పాఠశాలలకు గ్రౌండ్స్ కూడా లేవు. కేవలం తల్లిదండ్రుల ఆశలనే వీరు పెట్టుబడిగా మలుచుకుని అందినకాడికి దండుకుంటున్నారు.

– సూర్యప్రతాప్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, నంద్యాల

దినచర్యలో యోగా భాగం కావాలి

- జిల్లా యోగా వీడియోకు రాష్ట్ర స్థాయిలో ప్రథమం
- జిల్లా కలెక్టర్ రాజకుమారి



యోగా చేస్తున్న జడ్జీలు, న్యాయవాదులు

నంద్యాల(అర్బన్): దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ యోగాను చేర్చుకోవాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. శనివారం నంద్యాల పట్టణంలోని టెక్కె మార్కెట్ యార్డు ప్రాంగణంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా జిల్లా స్థాయి యోగాంధ్ర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా విశాఖపట్నంలో పీఎం మోదీ సభ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, జిల్లాస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు, విద్యార్థులు భారీ సంఖ్యలో హాజరై యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ మున్సిపల్, మెడికల్, ఆయుష్ శాఖలు గత నెల రోజుల నుంచి యోగ విన్యాసాలలో అవగాహన కల్పిస్తూ ప్రతిరోజు నిర్వహించే పనులు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ ఎప్పటికప్పుడు ఫొటోలను అప్‌లోడ్ చేశారన్నారు. యోగా కార్యక్రమంపై జిల్లాస్థాయిలో వివిధ రకాల పోటీలను నిర్వహించామన్నారు. మన జిల్లాలో తయారు చేసిన వీడియోకు రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి వచ్చిందని కలెక్టర్ తెలిపారు. అలాగే బనగానపల్లె బృందం తయారు చేసిన స్క్రిప్టుకు రాష్ట్ర స్థాయిలో మూడవ బహుమతి వచ్చిందన్నారు. అనంతరం యోగా గురువులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ శేషన్న, ఆయుష్ శాఖ సీనియర్ మెడికల్ అధికారి డాక్టర్ యశోధర, ఆర్డీఓ విశ్వనాథ్ పాల్గొన్నారు.




యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, జేసీ విష్ణుచరణ్, ఎమ్మెల్సీ ఇషాక్‌బాషా, అధికారులు, విద్యార్థులు

కోర్టు ఆవరణంలో యోగా దినోత్సవం

నంద్యాల(వ్యవసాయం): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కోర్టు హాల్‌లో జడ్జీలు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా మూడవ అదనపు జిల్లా జడ్జి అమ్మన్న రాజ, రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి తంగమణి, ఫస్ట్‌క్లాస్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి లక్ష్మికర్రి పాల్గొని యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా జడ్జీలు మాట్లాడుతూ న్యాయవాదులు, పోలీసు సిబ్బంది యోగా చేసి పని ఒత్తిడిని దూరం చేసుకోవచ్చన్నారు. అదే విధంగా ఆరోగ్యంగా, దీర్ఘకాలిక జబ్బులకు దూరంగా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హుసేన్‌బాషా, ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, ముక్కెర కృష్ణారెడ్డి, భూపని వెంకటేశ్వర్లు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశైలానికి పెరుగుతున్న వరద



శ్రీశైలండ్యాం

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలంలోని నీలంసంజీవరెడ్డి ప్రాజెక్ట్‌కు వరద తాకిడి పెరిగింది. జూరాలలో స్పిల్‌వే ద్వారా, విద్యుత్ ఉత్పాదన అనంతరం, సుంకేసుల బ్యారేజి నుంచి, సెల్ఫ్ క్యాచ్‌మెంట్ ఏరియాలో కురిసిన 40.60 మిల్లీమీటర్ల వర్షంతో శుక్రవారం నుంచి శనివారం వరకు డ్యాంలోకి 79,212 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. గత మూడు రోజులుగా శ్రీశైలం డ్యాం నుంచి దిగువ ప్రాంతాలకు నీటి విడుదలను నిలిపివేశారు. శనివారం సాయంత్రం సమయానికి జలాశయంలో 86.4762 టీఎంసీల నీరు నిల్వ ఉండగా.. డ్యాం నీటిమట్టం 852.90 అడుగులకు చేరుకుంది.

నేర నిరూపణతోనే బాధితులకు న్యాయం



మాట్లాడుతున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

బొమ్మలసత్రం: ప్రతి కేసును చిత్తశుద్ధితో దర్యాప్తు చేసి నేర నిరూపణకు సమర్థవంతంగా పనిచేసి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా పోలీసు అధికారులకు సూచించారు. శనివారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్, నేరగణాంకాల సేకరణ విశ్లేషణ, నిర్వహణ సంస్థ అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లు, కోర్ట్ మానిటరింగ్ సిస్టం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఆయన మాట్లాడుతూ ముద్దాయిలను అరెస్ట్ చేయడం, చార్జిషీట్ వేయడంతో పాటు కోర్టు విధివిధానాలు సరిగా పాటించి కేసు నిరూపణ చేయాల్సిన బాధ్యత కోర్టు కానిస్టేబుళ్లదేనన్నారు. నాన్‌బెయిలబుల్ వారెంట్లు, పాత పెండింగ్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కేసుల దర్యాప్తులో సమర్థవంతంగా విధులు నిర్వహించిన వారికి రివార్డులు, చట్టాన్ని అతిక్రమించే వారికి క్రమశిక్షణ చర్యలు తప్పవన్నారు.

విధేయుడా వందనం!

- కురుకుంద మాజీ సర్పంచ్ అర్తి కొండన్న మృతి
- రాజకీయాల్లో విలువలు చాటిన నిరుపేద గిరిజనుడు



మాజీ సర్పంచ్ చెంచు అర్తి కొండన్న (ఫైల్)

ఆత్మకూరురూరల్: నేటి సమాజంలో నీతిమంత రాజకీయాలు చేసేవారు అరుదుగా కనిపిస్తారు. రాజకీయ ఎదుగదల కాక్షించో.. పదవులు, డబ్బు కోసమో తెలియదు కానీ.. కొందరు నేతలు పొద్దున ఒక పార్టీలో ఉండి సాయంత్రం మరో పార్టీ వేదికపై కనిపిస్తారు. ఇలాంటి పరిస్థితుల్లో ఓ నిరుపేద గిరిజనుడు డబ్బుకు లొంగలేదు. తనను గెలిపించిన ప్రజల వెంటే ఉంటానని ఆఫర్‌ను తిరస్కరించాడు. అతనే వైఎస్సార్‌సీపీ నాయకుడు, కురుకుంద గ్రామ మాజీ సర్పంచ్ ఆర్థి కొండన్న(58). నీతివంతమైన రాజకీయాలకు చిరునామాగా నిలిచిన ఆయన శనివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా గ్రామస్తులు, పలువురు ఆయన రాజకీయ విలువల గురించి చర్చించుకోవడం కనిపించింది. 2014 ఎన్నికల్లో శ్రీశైలం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ టికెట్‌పై గెలిచిన బుడ్డా రాజశేఖరరెడ్డి కొద్ది రోజుల్లోనే టీడీపీలోకి జంప్ అయిన సంగతి తెలిసిందే. ఆ సందర్భంలో కురుకుంద సర్పంచ్‌గా ఉన్న చెంచు కొండన్నను కూడా టీడీపీలోకి ఆహ్వానించారు. గ్రామంలో టీడీపీ నాయకులకు అనుకూలంగా నడుచుకోమని చెప్పారు. అయితే చెంచు కొండన్న అందుకు నిరాకరిస్తూ తనకు ఓట్లు వేసి గెలిపించింది వైఎస్సార్‌సీపీ అభిమానులని, తాను ఆ పార్టీకి ద్రోహం చేయనని టీడీపీ నేతలకు తేల్చి చెప్పాడు. అలాగే ఎన్నికల ముందు కూడా టీడీపీకి చెందిన నాయకులు తనను పార్టీలోకి ఆహ్వానించినప్పుడు కూడా పొలాలకు కాపలా ఉండి జీవనం సాగించే కొండన్న ఎలాంటి ప్రలోభాలకు లొంగని అంశాన్ని గ్రామస్తులు ఈ సందర్భంగా గుర్తు చేసుకోవడం కనిపించింది. ఊరిలో ఇల్లు, అడవిలో చేను లేని ఆహార సేకరణ దశలోనే చెంచు జీవనం సాగించే గిరిజనుడు ఆనాడు ప్రలోభాలకు లొంగని విషయం నేటి రాజకీయ నాయకులకు ఆదర్శమేనని చెప్పవచ్చు. చిన్న స్థాయిలోనైనా విలువలకు కట్టుబడిన గిరిజన కొండన్నకు గ్రామస్తులు నీరాజనాలు అర్పించారు. కొండన్నకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు.

రక్తదానం చేసిన ఆర్డీఓ

ఆదోని టౌన్: పత్తికొండ ఆర్డీఓ డాక్టర్ ఎస్.భరత్‌నాయక్ శనివారం ఆదోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(ఏరియా ఆసుపత్రి)లో రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను ఇప్పటికే ఐదుసార్లు రక్తదానం చేశాన న్నారు. రక్తం దానం చేయడం ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపడమే అన్నారు.

మెప్మా సీఆర్పీ రిమాండ్‌కు తరలింపు

బొమ్మలసత్రం: పొదుపు మహిళల రుణాలను కాజేసి మోసం చేసిన మెప్మా సీఆర్పీ షేక్ వహీదాను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు నంద్యాల వన్ టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. నంద్యాల పట్టణంలోని ఫరూక్ నగర్ ప్రాంతానికి చెందిన షేక్ వహీదా మెప్మా సీఆర్పీగా పని చేస్తున్నారు. ఆమె పరిధిలోని 30 పొదుపు గ్రూపులు ఉన్నాయి. కాగా ఆయా పొదుపు గ్రూపులకు మంజూరు చేసిన రుణాలను సగం తీసుకుని మిగిలిన సగం మాత్రమే పొదుపు సభ్యులకు ఇవ్వడం.. అలాగే వారు చెల్లించిన రుణ కంతులను బ్యాంకులో జమ చేయకుండా కాజేశారు. అయితే తీసుకున్న రుణాలు చెల్లించలేదని బ్యాంకు అధికారులు పొదుపు మహిళలకు నోటీసులు పంపడంతో సీఆర్పీ వహీదా అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. మోసపోయామని గ్రహించిన పొదుపు మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఆర్పీ వహీదాపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశామని సీఐ తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు ఆమెను రిమాండ్‌కు తరలించామన్నారు.

దైవదర్శనానికి వెళ్లి వస్తూ తిరిగిరాని లోకాలకు ...

● ఆటో బోల్తా పడి వృద్ధురాలి దుర్మరణం


ప్రమాదస్థలం వద్ద క్షతగాత్రులు


ప్రమాదంలో మృతి చెందిన లక్ష్మీదేవి

గోస్పాడు/మహానంది: ఎస్.నాగులవరం-పసురపాడు గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మహానంది మండలం మసీదుపురం గ్రామానికి చెందిన ఓ కుటుంబం దైవ దర్శనం నిమిత్తం రంగాపురం సమీపంలోని మద్దిలేటిస్వామి దర్శనానికి ఆటోలో వెళ్లారు. పూజలు నిర్వహించుకుని తిరిగి వస్తుండగా ఎస్.నాగులవరం సమీపంలో ఆటో ప్రమాదవశాత్తు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆవుల లక్ష్మీదేవి(65) అక్కడికక్కడే మృతి చెందింది. వెంకటేశ్వర్లు, మౌనిక, చిన్న నరవయ్య, లక్ష్మిపతి, ఆవుల నరసమ్మలు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించగా, ఆవుల నరసమ్మను మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. మృతురాలు లక్ష్మీదేవి భర్త గత కొద్దినెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందారని, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు బంధువులు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పాణ్యం: పిన్నాపురం గ్రామ రస్తాలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. శనివారం సాయంత్రం గొర్రెల కాపరులు గడ్డిలో నుంచి దుర్వాసన వస్తుండడంతో వెళ్లి చూడగా వ్యక్తి మృతదేహం కుళ్లిపోయి కనిపించింది. మృతదేహంపై దుస్తులు లేకపోవడం, కాళ్లకు బెల్ట్ చెప్పులు ఉన్నట్లు గుర్తించారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. కాగా వేరే ప్రాంతంలో హత్య చేసి మృతదేహాన్ని ఇక్కడ పడేసి ఉంటారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా ఔషధ నియంత్రణ అధికారి బాధ్యతల స్వీకరణ

గోస్పాడు: జిల్లా ఔషధ నియంత్రణ అధికారిగా హనుమన్న శనివారం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన దాదా ఖలందర్ చిత్తూరు జిల్లా మదనపల్లెకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అనంతపురంలో పని చేస్తున్న హనుమన్నను ఇక్కడికి బదిలీ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన విధుల్లో చేరారు. నంద్యాల డ్రగ్ ఇన్‌స్పెక్టర్ బాధ్యతలతో పాటు కర్నూలు అర్బన్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించనున్నారు. డోన్, డివిజన్‌కు డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌గా కర్నూలు రూరల్ విభాగానికి జయరాంను నియమించారు.

నల్లమలలో ట్రాఫిక్ జాం


నల్లమలలో నిలిచి పోయిన ట్రాఫిక్

ఆత్మకూరురూరల్: నల్లమల ఘాట్ రోడ్డులో వాహనాల రాకపోకలకు నిలిచి ప్రయాణికులు, వాహనదారులు అవస్థలు పడ్డారు. ఆత్మకూరు - దోర్నాల ప్రధాన రహదారిలోని నంద్యాల - ప్రకాశం జిల్లాల సరిహద్దుల్లో శనివారం భారీ వృక్షం నేల కూలడంతో రెండు గంటల సేపు ట్రాఫిక్ నిలిచి పోయింది. పెద్ద పెంట రాస్తా ఏటిపాయ గేటు వద్ద మధ్యాహ్నం 12 గంటల సమయంలో జరిగిన ఈ ఘటనతో దాదాపు 2 గంటల వరకు అడవిలో ప్రయాణికులు అల్లాడి పోయారు. అటవీ శాఖకు చెందిన ప్రొటెక్షన్ వాచర్లు అక్కడికి చేరుకుని చెట్టును తొలగించడంతో వాహనాల రాకపోకలు యథాతథంగా కొనసాగాయి.

సచివాలయ ఉద్యోగుల సమాచారాన్ని పంపండి

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గ్రామ/వార్డు సచివాలయాల్లోని ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన సమాచారాన్ని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 22వ తేది నాటికి పక్కాగా పంపించాలని జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసరరెడ్డి కోరారు. శనివారం సా యంత్రం ఆయన తన చాంబర్ నుంచి జిల్లా లోని ఎంపీడీఓలతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా వివరాలను అప్‌లోడ్ చేయాలన్నారు. అర్బ న్ ప్రాంతాల్లోని సచివాలయాలకు సంబంధించి ఏవైనా సాంకేతిక సమస్యలను, ఇతరత్రా వాటిని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

వసతి మూత'బడి'

● తలుపులు తెరుచుకోని బీసీ బాలుర వసతి గృహం
● ఇంటి బాట పట్టిన విద్యార్థులు



తలుపులు తెరుచుకోని బీసీ బాలుర వసతి గృహం, మూతపడిన గదులు

ఆలూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యా వ్యవస్థ అస్తవ్యస్తమైంది. పేద విద్యార్థులకు వసతి గృహాలు కూడా అందుబాటులోకి రాని దుస్థితి ఏర్పడింది. ప్రభుత్వ పాఠశాలలు ఈ నెల 12న పునఃప్రారంభం కాగా ఆలూరులోని సాంఘిక సంక్షేమ శాఖ బీసీ బాలురు వసతి గృహం ఇంత వరకు తెరుచుకోలేదు. విద్యార్థులు ఇక్కడ ఉండలేక ఇంటి బాట పట్టారు. సొంత భవనం లేకపోవడంతో ఆలూరు సమీపంలోని ఎల్లార్తి రోడ్డు వద్ద ప్రగతి జూనియర్ కళాశాల, పాఠశాల ఆవరణలోనే గత ఏడాది నుంచి సాంఘిక సంక్షేమ శాఖ బీసీ బాలురు వసతి గృహాన్ని నిర్వహిస్తున్నారు. ఇక్కడ బాలుర వసతి గృహంలో 120 మంది, కళాశాల వసతి గృహంలో 110 మంది ఉంటున్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న హెచ్‌డబ్ల్యూఓ సంపత్‌కుమార్‌ను ఈనెల 10న కర్నూలుకు బదిలీ చేశారు. ఆదోని డివిజన్ ఏఎస్‌డబ్ల్యూఓగా విధులు నిర్వహిస్తున్న రాజా కుళ్లాయప్ప ఈనెల 1న పదవీ విరమణ పొందారు. ఆదోని, ఆలూరు సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న బీసీ సంక్షేమ వసతి గృహాలకు ఏఎస్‌డబ్ల్యూఓగా పత్తికొండలో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులకు ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించారు. ఆలూరు బీసీ బాలుర వసతి సంక్షేమ కళాశాల వసతి గృహానికి అనిమిరెడ్డిని హెచ్‌డబ్ల్యూఓగా అధికారులు నియమించారు. అయితే ఆరోగ్య కారణాలతో ఆయన ఇప్పటి వరకు బాధ్యతలు స్వీకరించలేదు. వసతి గృహాల తలుపులకు మూతపడి ఆదివారం నాటికి 22 రోజులకు చేరుతుంది. వసతి గృహం తెరవకపోవడంతో విద్యార్థులు ఇంటిబాట పడుతున్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, ఒక ఫైల్ కూడా పంపామని ఏఎస్‌డబ్ల్యూఓ శ్రీనివాసులు తెలిపారు.

అడుగు దూరంలో నీటి విడుదల

● పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ గేట్లను తాకిన కృష్ణాజలాలు


పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ గేట్లను తగిలిన కృష్ణాజలాలు

జూపాడుబంగ్లా: ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయంలోకి వస్తున్న వరద ప్రవాహం కొనసాగుతుండటంతో నీటిమట్టం రోజుకు రోజుకు పెరిగి కృష్ణాజలాలు పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ గేట్లను తగిలాయి. ప్రస్తుతం పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ వద్ద 851.90 అడుగుల నీటిమట్టం ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. నిబంధనల ప్రకారం శ్రీశైలం డ్యాంలో 854 అడుగుల నీటి మట్టం చేరుకోగానే పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ గేట్లు ఎత్తి దిగువ ప్రాంతాలకు సాగునీటిని విడుదల చేసుకోవచ్చు. గతేడాది జులై 27న పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ గేట్లు ఎత్తి దిగువనున్న కాల్వలకు సాగు, తాగునీటిని విడుదల చేశారు. ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్‌లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నా ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలవల్ల శ్రీశైలం డ్యాంలోకి వరదనీరు వచ్చి చేరుతుండటంతో క్రమేణా డ్యాంలో నీటిమట్టం పెరుగుతూ వస్తోంది. వరద ప్రవాహం కొనసాగుతుండటంతో గతేడాది కంటే నెలరోజులు ముందుగానే పోతిరెడ్డిపాడు నుంచి దిగువకు నీటిని విడుదల చేసుకునే అవకాశాలున్నాయి.

ఆత్మహత్యలే శరణ్యం


గూడూరులో సెల్ టవర్ ఎక్కి నిరసన తెలుపుతున్న నగర పంచాయతీ కార్మికులు

కోడుమూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే తమకు ఆత్మహత్యలే శరణ్యమని నగర పంచాయతీ కార్మికులు కన్నీటి పర్యంతమయ్యారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం గూడూరు సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులు ఆరవింద్, మధు మాట్లాడుతూ.. చాలీచాలని జీతాలతో పని చేస్తూ తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. 15 సంవత్సరాలకు పైబడి పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయడంతో పాటు నెలనెలా సక్రమంగా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం 46రోజుల నుంచి విధులు బహిష్కరించి నిరవధిక దీక్షలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. నిరసనలో కార్మికులు దూకేశ్వరరావు, షబ్బీర్, ఆంజనేయులు, బసవరాజు, జయన్న, అల్లిబాషా, ఖాజా, ప్రభాకర్, ఉసేన్, పఠాన్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా ఫక్కీలో రూ.2 లక్షలు చోరీ

ఆదోని అర్బన్: సినిమా ఫక్కీలో రైతుకు సంబంధించిన రూ.2 లక్షల డబ్బును శనివారం చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆలూరు మండలం ఎ.గోనేహాల్ గ్రామానికి చెందిన రైతు రవికుమార్‌రెడ్డి ఆదోని పట్టణంలోని ఇండియన్ బ్యాంకుకు వచ్చాడు. తన వద్ద ఉన్న 5.42 గ్రాముల బంగారాన్ని తాకట్టు పెట్టి రెండున్నర లక్షలు రుణం తీసుకున్నారు. ఇందులో రెండు లక్షలు డ్రా చేసుకుని బయటకు వచ్చాడు. బైకు బ్యాగులో డబ్బు పెట్టాడు. తన బైకు అడ్డంగా ఉన్న బైకును పక్కకు తీస్తుండగా రూ.2 లక్షలు మాయమయ్యాయి. రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ శ్రీరాం సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అక్కడున్న సీసీ కెమెరాలు తదితర విషయాలపై ఆరా తీశారు. రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

'కూటమి' నాయకుల ధ్వంస రచన

● ఆదోనిలో వైఎస్సార్‌సీపీ జెండా కట్ట ధ్వంసం
● త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు


జెండా కట్ట ధ్వంసం చేసిన దృశ్యం

ఆదోని టౌన్: ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా 'కూటమి' నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ధ్వంస రచన చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. ఆదోని పట్టణంలోని విజయనగర్ కాలనీలో శుక్రవారం రాత్రి వైఎస్సార్‌సీపీ జెండా కట్టను ధ్వంసం చేశారు. జెండా, జెండాకు సంబంధించిన పైపును విరగొట్టారు. శనివారం ఉదయం సమాచారం అందుకున్న మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహులు, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు దేవ, పట్టణ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్ తదితరులు అక్కడి వెళ్లి ధ్వంసమైన కట్టను పరిశీలించారు. అనంతరం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌కు ఫిర్యాదు చేశారు. ప్రజల తరపున వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుండాన్ని చూస్తూ సహించలేక ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడ్డారన్నారు. పార్టీ జెండాను ఇలా అవమానించడం తగదన్నారు. ఇలాంటి దుశ్చర్యలతో ఘర్షణలు, గొడవలు జరిగే ప్రమాదం ఉందన్నారు. దుండగులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. వైఎస్సార్‌సీపీ పట్టణ సెక్రటరీ తాయన్న, ఎస్సీ సెల్ పట్టణాధ్యక్షుడు యేసేపు, కౌన్సిలర్ అశోక్, నాయకులు ప్రసాద్, బుడ్డేకల్ బాబు, కిషోర్, పట్టణ కార్యదర్శి బాబా, కౌన్సిలర్లు రఘునాథ్‌రెడ్డి, ఫయాజ్, అశోక్, నాయకులు దినేష్, ఉస్మాన్, చిన్నరామకృష్ణారెడ్డి, భీమ, వీరప్ప, నారాయణ, హరిశ్చంద్ర, కౌన్సిలర్ చలపతి తదితరులు పాల్గొన్నారు.